ఎల్‌ఐసి ఏజెంట్ల ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం వద్ద ఎల్‌ఐసి ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐఎఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. పాలసీలపై జిఎస్‌టి రద్దు చేయాలని, బోనస్‌లను వెంటనే పెంచాలని, ఏజెంట్ కమిషన్ అన్ని పాలసీలపై పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్రాంచి మేనేజర్‌కు అందజేశారు. తమ డిమాండ్స్ నెరవేరకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆందోళన చేస్తున్న ఎల్‌ఐసి ఏజెంట్లు

చి'వరి'లో వర్రీ..!

అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్లో తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి.

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు
- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- రెండు జిల్లాల్లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో వరిసాగు
- పంటంతా పొట్ట, ఈనిక దశలోనే
- మెట్ట ప్రాంతంలో మొదలైన వరి మాసూళ్లు
- ప్రస్తుత ఖరీఫ్‌లో రెండుసార్లు రైతులకు కోలుకోలేని దెబ్బ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. భారీ వర్షాలకు ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటికే రెండుసార్లు రైతులు పంట నష్టపోయారు. జులైలో విరుచుకుపడిన వరదలకు పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో 13,307 ఎకరాల్లో రైతులు వరిపంట కోల్పోయారు. రైతులకు రూ.11 కోట్లు పరిహారం అందించాలని అధికారులు తేల్చారు. ఆగస్టు మొదటివారంలో విరుచుకుపడిన వరదలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 16,030 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మొత్తం రూ.16 కోట్లు పరిహారం ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించగా, ప్రభుత్వం ఆ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసింది. పంట నష్టం నమోదులో 33 శాతం నిబంధన అన్నదాతకు పరిహారం అందకుండా చేసిన పరిస్థితి నెలకొంది. వాస్తవానికి రెండు జిల్లాల్లో పెద్దఎత్తున పంట నష్టం జరిగింది. నిబంధనల పేరుతో చాలామంది రైతులకు పంట నష్టపరిహారం అందలేదు. వరదలకు, వర్షాలకు నష్టపోగా మిగిలిన పంటను రైతులు ఎన్నో కష్టాలకోర్చి చివరి దశకు తెచ్చారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో ముందుగా వరి సాగు చేసిన తాడేపల్లిగూడెం, ఉంగుటూరు వంటి మండలాల్లో వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. డెల్టాలో మాత్రం వరి పంటంతా పొట్ట, ఈనిక దశలోనే ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే తరుణంలో తుపాను హెచ్చరికలతో రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు విరుచుకుపడిన భారీవర్షాలు, వరదలకు జిల్లా రైతాంగం తీవ్ర నష్టాలను చవిచూసింది. పంట చివరి దశలో ఉన్న తరుణంలో ఏదైనా ప్రకృతి విపత్తు సంభవిస్తే తీవ్ర నష్టాన్ని రైతులు చూడాల్సి ఉంటుంది. రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయనే హెచ్చరికలతో అన్నదాత తీవ్ర భయాందోళనకు గురవుతున్నాడు.

కోలుకోలేని స్థితిలో కౌలురైతు

రెండు జిల్లాల్లో వ్యవసాయ సాగు 70 శాతానికిపైగా కౌలు రైతులే చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం కౌలుచట్టంలో చేసిన మార్పులతో కౌలుకార్డులుగాని, బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని కౌలురైతులకు సక్రమంగా అందని దుస్థితి నెలకొంది. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రైతులు పెట్టుబడులు పెట్టారు. ఐదెకరాలు సాగు చేసిన రైతు ఇప్పటికే తక్కువగా లెక్కించినా రూ.లక్షకుపైగా అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదైనా తేడా వస్తే కౌలురైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారనుంది. ఇప్పటికే రెండుసార్లు పంట దెబ్బతిని కోలుకోలేని స్థితిలోకి కౌలురైతులు చేరుకున్నారు. దీంతో మరోసారి తుపాను హెచ్చరికలు కౌలురైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పంట దెబ్బతింటే పంట నష్టపరిహారం, బీమా సైతం కౌలురైతులకు అందడం లేదు. పెట్టుబడి పెట్టని భూయజమానుల జేబుల్లోకి చేరుతున్నాయి. తుపాను సంభవిస్తే పొట్ట దశలో ఉన్న పొలాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. తుపాను గండం నుంచి పంట గట్టెక్కుతుందా.. లేదా అనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి మంత్రులను నియమించలేదు. దీంతో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులే కీలక పాత్ర పోషిస్తున్నారు. జిల్లా సమీక్షా సమావేశాల్లో జిల్లాకు చెందిన మంత్రులు పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏలూరు జిల్లాలో మంచి పట్టుంది. ఏలూరులోని ఏడు నియోజకవర్గాల్లో ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల్లో జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరులో ఇన్‌ఛార్జి మంత్రి పాత్ర కీలకంగా ఉంటుంది. అంతేకాకుండా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికం వరి సాగవుతోంది. ప్రతియేటా ధాన్యం కొనుగోలులో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పౌర సరఫరాల శాఖకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులవ్వడంతో రైతుల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లాకు చెందిన సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధిని బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులయ్యారు.

'పశ్చిమ' ఇన్‌చార్జి మంత్రిగా గొట్టిపాటి రవికుమార్

పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మంత్రి నిమ్మల రామానాయుడుని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

- అర్జీల పరిష్కార తీరు నాణ్యంగా ఉండాలి
- కలెక్టర్ కె.వెట్రిసెల్వి
- పిజిఆర్‌ఎస్‌కు 81 వినతులు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అర్జీదారులు తెలియజేసిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పరిష్కారాన్ని వేగవంతంగా అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్‌తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారానికి పిజిఆర్‌ఎస్‌కు 81 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీకీ పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. ద్వారకా తిరుమల మండలం సంద్రుగుంటకు చెందిన చిగురుపాటి మోహన్‌రావు అర్జీనిస్తూ తనకు తెలియకుండా తన పిల్లలు ఇల్లు తాకట్టు పెట్టి మోసగించారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత సిఐ, ఎస్‌ఐలను ఆదేశించారు. శనివారపు పేటకు చెందిన బొడ్డు రామానుజయ వినతిపత్రం ఇస్తూ 26వ డివిజన్ శనివారపుపేట కుమ్మరిగొయ్యి రోడ్డుపై అక్రమంగా షాపులు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు నగర కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. చింతలపూడి మండలం కాంచనగూడేనికి చెందిన బోయిన అక్కమ్మ వినతిపత్రం ఇస్తూ ప్రగడవరంలో తమ భూమిని మల్లయ్యగూడేనికి చెందిన వారు ఆక్రమించారని, ఈ విషయంపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో తాగునీరు, డ్రెయినేజీ, రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో రూ.15.50 లక్షలతో నిర్మించనున్న ఐదు సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, రోడ్లు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి పార్థసారధి మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని పంచాయతీరాజ్ శాఖాధికారులను ఆదేశించారు. పాడైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయడమే పల్లె పండుగ ముఖ్యోద్దేశమన్నారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన మంత్రి వారితోపాటు ఆరుబయట కూర్చొని సమస్యలను అడిగి తెలుసుకోవడం అందరినీ ఆకర్షించింది. అనంతరం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని మంత్రి సందర్శించారు. దేవాలయ ఛైర్మన్ పి.నరసింహారావు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేల విరాళాన్ని మంత్రి పార్థసారధికి అందించారు. నరసింహారావును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో పులి బళ్ల లక్ష్మీ సత్యనారాయణ, మండల అధికారులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

రికార్డు స్థాయిలో ఆయా గ్రామసభల్లో చేసుకున్న తీర్మానాలు కార్యరూపం దాల్చుకుని ఇవాళ సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం చాలా గర్వకారణంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో గ్రామ సర్పంచి పులిబళ్ల లక్ష్మీసత్యనారాయణ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సూరేపల్లి, లోపూడి, బాసవరపాడు, చెక్కపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కిరెడ్డిగూడెంలో రూ.15.50 లక్షలతో నిర్మించనున్న ఐదు సీసీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, రోడ్లు పాడైపోయి చాలా ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి పార్థసారధి స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖాధికారులను ఆదేశించారు. పాడైన రోడ్ల స్థానంలో కొత్తగా రోడ్లు నిర్మిస్తానని మంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు. లోపూడిలో రూ.20 లక్షలతో చెక్కపల్లిలో సుమారు రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, సర్పంచి పులి బళ్ల లక్ష్మీ సత్యనారాయణ, మలిబాబు, వేంపాటి శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, కొల్లి గంగారం, మందలపు ధర్మరాజు, మేదరమెట్ల సురేంద్ర, టి.రాధిక సత్యనారాయణ, మండల అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కొలుసు పార్థసారధి

11వ రోజు కొనసాగిన టెట్ పరీక్షలు

ఏలూరు అర్బన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్)-2024 మంగళవారం 11వ రోజు ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్‌ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 158 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 186 మందికి 166 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగినట్లు డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు.

మొక్కజొన్న సీడ్ కంపెనీలు అగ్రిమెంట్లు ఇవ్వాలి

- చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేయాలి
- పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి
- ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రైతు సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అభివాదం చేస్తున్న నేతలు

మొక్కజొన్న విత్తన రైతులకు విత్తన కంపెనీల నుండి అగ్రిమెంట్లు ఇప్పించాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతు సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం నూజివీడులోని సుందరయ్య భవనంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ప్రాంతీయ రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు అధ్యక్షత వహించారు. పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కజొన్న సీడ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు కంపెనీల నుండి ఆర్గనైజర్ల ద్వారా విత్తనాలు ఇస్తున్నారన్నారు. అయితే కంపెనీలు రైతులకు ఎటువంటి అగ్రిమెంట్లు ఇవ్వకపోవడం వల్ల మోసాలకు గురై విత్తన రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంగాని, వ్యవసాయ శాఖగాని విత్తన కంపెనీల మోసాలను అరికట్టేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. విత్తన కంపెనీ ప్రతినిధు లతో వెంటనే జాయింట్ మీటింగులు ఏర్పాటు చేసి రైతులకు కంపెనీలు అగ్రిమెంట్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విత్తన రైతులకు వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై అందించాలన్నారు. ఇ-క్రాప్ నమోదులో విత్తన పంటగానే నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు మేలు జరిగేలా సమగ్ర విత్తన చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, అందుకు తగిన నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గత టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో రైతులు పోరాటాలు చేసినా పట్టించుకోకుండా మాయ మాటలు చెప్పి తప్పించుకున్నారని గుర్తు చేశారు. భూములు కోల్పో తున్న రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవా లన్నారు. నూజివీడు పెద్ద చెరువు గండి వల్ల పంట భూముల్లో ఏర్పడిన ఇసుక మేటలను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మామిడి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయిల్ పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. పత్తి, మిర్చి, అపరాలు తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజు మాట్లా డుతూ రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయాలని, గత ప్రభుత్వం జారీ చేసిన జిఒ 22ను రద్దు చేయాలని కోరారు. అనంతరం సిహెచ్.నాగరాజు రైతాంగ సమ స్యలపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. సదస్సులో నాయకులు పి.బోసు, ఎం. లెనిన్, బి.రాంబాబు, సిహెచ్.శ్రీనివాసరా వు, కె.వీర వెంకయ్య, మణిరాజు, తాతారావు, ఎం.శౌరీ, కె.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, బి.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే లక్ష్యంగా పని చేయాలి

పోలీసు సిబ్బందికి ఎస్‌పి సూచన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళల భద్రతే మన లక్ష్యమని, వారి భద్రతకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పని చేయాలని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మహిళా సంబంధిత ఫ్లెక్సీలను, పలు రికార్డులను పరిశీలించారు. బాధితులకు శాఖ అందిస్తున్న భరోసా అంశాలపై ఆయన ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలపై వచ్చిన మహిళలకు ఇచ్చే కౌన్సెలింగ్‌పై ఆయన మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహిళల భద్రతే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన మహిళల పట్ల గౌరవ మర్యాదలతో నడుచుకోవాలన్నారు. మహిళలకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్ఐ క్రాంతిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

నేటి నుంచి ప్రయివేటు మద్యం దుకాణాలు

ఏడు రోజులకు తాత్కాలిక లైసెన్స్ మంజూరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో 144 మద్యం షాపులకు లైసెన్స్ ప్రక్రియ సోమవారం పూర్తయినందున బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. గత ఐదేళ్లుగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు గడువు ముగియనుంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన మద్యం సరుకును తొమ్మిది గంటల తర్వాత ఎక్సైజ్ శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకుని డిపోకు తరలిస్తారు. కొత్తగా మద్యం షాపులు దక్కించుకున్న లైసెన్స్‌దారులు మంగళవారం సాయంత్రం నుంచి నెట్ బ్యాంకింగ్ ద్వారా ఎపి బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు సొమ్ములు చెల్లించి తమ ఇండెంట్ సమర్పించి సరుకును పొందొచ్చు. అయితే మంగళవారం మధ్యాహ్నం వరకు లైసెన్స్ పొందిన వారి లాగిన్ క్రియేట్ అవ్వలేదని తెలుస్తుంది. ఇక నిబంధనలు చూస్తే ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మద్యం అమ్మకాలు సాగించవచ్చు. పది గంటల తర్వాత గాని ఉదయం పది గంటల లోపు గాని మద్యం అమ్మకాలు నిషేధం. అలాగే ఎక్కడా బెల్టు షాపులు నిర్వహించడం కానీ, ఎంఆర్‌పి ధరలకంటే ఎక్కువ అమ్మటం గాని చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మద్యం షాపుల్లో లూజు అమ్మకాలు సాగించటం కానీ, అక్కడ తాగేందుకు గానీ అనుమతి లేదు. ప్రస్తుతం పర్మిట్ రూములకు ఎలాంటి అనుమతి లేదు. ప్రతిరోజు కచ్చితంగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలి. ప్రస్తుతం మద్యం దుకాణాలు నిర్వహించడానికి తగిన షాపులు, భవనాలు చూసుకోవాల్సి ఉన్నందున ఏడు రోజుల పాటు తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేశారు. 22వ తేదీన ఒరిజినల్ లైసెన్సులు లైసెన్స్ దారులకు అందిస్తారు.

వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

విద్యార్థినులతో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రతను మరింత మెరుగుపరుచుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఏలూరులోని శిశు గృహం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను కె.రత్నప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతుల పైన అలాగే వసతి గృహాల పరిశుభ్రత, మంచినీరు, ఆహారం, వైద్యం, రక్షణ సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక అమీనాపేటలోని వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రతను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తే తక్షణ చర్యలు తీసుకుంటారని, అవసరమైన పక్షంలో న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్ కోనే సునీత, డిసిపిఒ సూర్య చక్రవేణి, వసతి గృహాల వార్డెన్లు వెంకటేశ్వరమ్మ, రాధాదేవి, ఎస్.సర్వమంగళ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థినులు

నూజివీడు టౌన్ : గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు రాధికారాణి తెలిపారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-17 బాలికల ఎంపికలో ఎం.మేఘున, ఈర్ల జయశ్రీ అనూష ఎంపికయ్యారని తెలిపారు. నంద్యాల డిఎస్ఎ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరక్టర్ రవీంద్రను పలువురు అభినందించారు. ఉపాధ్యాయులు జల్దు లక్ష్మి, మనోహరం, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, శిరీష, నారాయణ, రంగారావు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా ఏలూరు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరును ఉల్లాస్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమం అమలుపై మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో నిరక్షరాస్యులందరినీ రానున్న మూడేళ్ల సమయంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన వంటవారు, వాచ్‌మెన్, ఆయాలతోపాటు జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరక్షరాస్యులను మండల స్థాయిలో గుర్తించి, వారికి అక్షరాస్యత కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

కెఆర్.పురం ఐటిడిఎ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో మెగా డిఎస్‌సికి సన్నద్ధమవుతున్న గిరిజన యువతీ యువకులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఎ పిఒ, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బిఇడి, డిఇడి, టెట్ పాసై కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 21 లోపు జ్ఞానభూమి పోర్టల్ https://jnanabhumi.ap.gov.in లేదా https://mdfc.apcf-ss.in లో నమోదు చేసుకోవాలని తెలిపారు. సదరు ధరఖాస్తులను ఆరు దశల పరిశీలన అనంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయిలో విజయ్ ప్రతిభ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన ఊదర్ల విజయ్ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ స్కూల్‌లో చదివి జాతీయ స్థాయిలో 13 నేషనల్ ఛాంపియన్‌షిప్‌ల్లో పాల్గొని రోయింగ్, సేపక్ తక్రా గేమ్స్‌లో పలు పతకాలు సొంతం చేసుకున్నారు. వైఎస్ఆర్ క్రీడా ప్రోత్సాహం రూ.25 వేలు కూడా అందుకున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డిఎస్‌డిఒ శ్రీనివాస్, రాష్ట్ర రోయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఉప్పటి సెక్రటరీ వి.వెంకటేశ్వరరావు (ఇండియన్ ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్)ల ప్రోత్సాహంతో జంగారెడ్డిగూడెంలో ఉన్న ఎర్రకాలువ వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో కోచ్, ఇన్‌ఛార్జిగా విజయ్ విధులు నిర్వహించారు. చండీఘర్‌లో జరిగిన నేషనల్ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌కి టీమ్ మేనేజర్‌గా వ్యవహరించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డిఎస్‌డిఒ శ్రీనివాస్ పిలుపు మేరకు ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించి నెల రోజుల పాటు 80 మంది పిల్లలకు ఫ్రీ సమ్మర్ కోచింగ్ ఇచ్చి స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ కోచింగ్ క్యాంపు సర్టిఫికెట్స్ ఇచ్చారు. పశ్చిమ గోదావరి రోయింగ్ అసోసియేషన్ ఏర్పాటు చేయడంలో చాలా కీలక పాత్ర పోషించారు. విజయ్ తండ్రి జోసే కూడా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రోయింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉంటూ రోయింగ్ అసోసియేషను అభివృద్ధి చేయడంలో కృషి చేస్తున్నారు.

హామీల అమల్లో టిడిపి కూటమి విఫలం

ప్రజాశక్తి - నిడమర్రు

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు అన్నారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం శాఖ సమావేశం గవర సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అధికార పెత్తనం చేయడానికి ప్రతిపక్షం నుంచి అధికార పార్టీ బదలాయింపులు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఏ ఒక్కటి అమలు జరగలేదన్నారు. పెరిగిన ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో వెంగలదేటి మోహన, కోన శ్రీనివాసరావు, కె.వరప్రసాద్, లావేటి సోంబాబు, కాసారు రాజు, కమిలి నాని పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పత్తిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని అంకన్నగూడెం, రాచన్నగూడెం పరిధిలోని రైతు సేవ కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం పత్తి పంటలో సస్య రక్షణతో అధిక దిగుబడి వస్తుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగకరంగా సమాచార హక్కు చట్టం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమాచార హక్కు చట్టం ప్రజలకు ఎంతగానో దోహదపడుతుందని, విలువైన సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు సమస్యల సత్వర పరిష్కారానికి ఉపయోగపడుతుందని ఆగిరిపల్లి తహశీల్దార్ పిఎస్ఎ.ప్రసాద్ అన్నారు. సమాచార హక్కు చట్టం-2005వారోత్సవాలను పురస్కరించుకుని, సమాచార హక్కు చట్టం ప్రచార పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.వివేక్‌కుమార్, ఎస్ఆర్ఐఆర్ఎస్ ఎపిఒ మీనాక్షి, ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు, కార్యదర్శి సయ్యద్ లాల్ సాహెబ్, ఎంకాజీ లంకపల్లి, దేవరపల్లి రమేష్, దొండపాటి దినేష్ పాల్గొన్నారు.

వృత్తి విద్యతో భవిష్యత్తుకు బంగారు బాట

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వృత్తి విద్యను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవచ్చని ఒకేషనల్ కో-ఆర్డినేటర్ పాశా వెంకట్ అన్నారు. మండలంలోని గవరవరం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా కొయ్యలగూడెం ప్రభుత్వాసుపత్రిలో విద్యార్థులకు ఎనిమిది రోజులపాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యలో భాగంగా పలు అంశాల పట్ల డాక్టర్ ఎస్ఎరుదాల ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు మేలుకలిగే పాటుగా అవగాహన ఏర్పాటు చేసినట్లు వెంకట్ తెలిపారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఈ విద్య కోర్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్లపల్లి రాజు, ఒకేషనల్ ట్రైనర్ ఎం.ఎం.మంజూష, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్వామి అయ్యప్ప దీక్ష మందిరంలో నిర్వహిస్తున్న అన్న సమారాధనకు డాక్టర్ కొండముది దిలీప్ కుమార్ శ్యామలా దంపతులు రూ.పది వేలు అందించారు. బెంచ్‌పల్లి సెంటర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదాన సమారాధన కార్యక్రమంలో భాగంగా వీరు విరాళాన్ని నిర్వాహకులకు అందించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో టిడిపి నేతకు గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డు ప్రమాదంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వరరావు గాయాలపాలయ్యారు. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం... చింతలపూడి నగర పంచాయతీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు గాయాలపాలయ్యారు. ఆయనను స్థానికులు ఏలూరుకు తరలించారు.

పాముకాటుతో పాడి రైతుకు అస్వస్థత

పోలవరం :పాముకాటుతో పాడిరైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం పోలవరం పంచాయతీ నూతనగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పోలవరం పంచాయతీ నూతనగూడెం గ్రామానికి చెందిన ఉడతా గంగాధర్ పశువుల మేత కోసం పంట చేలో మంగళవారం గడ్డి కోస్తుండగా పాము కరిచి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన స్థానికులు అతనిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి కృష్ణకాంత్ అతనికి ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫ్రీజర్‌కు మరమ్మతులు చేయరూ..!

బుట్టాయగూడెం వాసుల వేడుకోలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రీజర్ బాక్సుకు మరమ్మతులు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్వచ్ఛందంగా ఇచ్చిన ఫ్రీజర్‌కు సామాజిక ఆరోగ్య కేంద్రం వారు కనీసం మరమ్మతులు చేయించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల కొరత వల్ల ఫ్రీజర్‌కు మరమ్మతులు చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. బుట్టాయగూడెం మండల కేంద్రంలో ఫ్రీజర్ లేకపోవడంతో జంగారెడ్డిగూడెం వెళ్లి తెచ్చుకోవడానికి ప్రయాణ ఖర్చులు భరించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అంత్యక్రియల ఖర్చుల కంటే ఫ్రీజర్ ప్రయాణ ఖర్చులే ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛందంగా ఎవరైనా ఈ ఫ్రీజర్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బుట్టాయగూడెం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యంత విస్తీర్ణం కలిగిన పెద్ద మండలం. మండలంలో 21 పంచాయతీలు 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇంత ప్రాధాన్యం పొందిన మండల కేంద్రంలో కనీసం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల అవసరాల దష్ట్యా ఫ్రీజర్ బాక్స్ లేదు. ఎవరైనా చనిపోయిన తర్వాత బంధువులు దూరప్రాంతాల్లో ఉన్నప్పుడు వారు వచ్చేవరకు మృతదేహం పాడవకుండా ఉండడానికి శీతలీకారణ పెట్టె అవసరం. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రీజర్ మరమ్మతులకు గురైంది. ఈ ఫ్రీజర్‌ను జంగారెడ్డిగూడెం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్వచ్ఛందంగా ప్రజల అవసరాల నిమిత్తం బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అందించారు. కొన్నేళ్ల నుంచి ఈ ఫ్రీజర్ పనిచేయడంలేదు. దీనిని బాగు చేయించుకునేందుకు నాయకులు, అధికారులు ఎవరూ స్పందించడంలేదు. మరమ్మతులకు గురైన ఫ్రీజర్‌ను బాగు చేయించకుండా పైకప్పులు పగిలిపోయి ఉన్న రేకుల షెడ్డులో ఉంచారు. దీంతో ఆ ఫ్రీజర్ వర్షానికి తడుస్తూ ఉంది. బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎవరైనా చనిపోతే అంతిక్రియలకు అయ్యే ఖర్చుల కంటే జంగారెడ్డిగూడెం నుంచి ఫ్రీజర్‌ను తీసుకురావడానికే ఎక్కువ ఖర్చులు అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు, పాలకులు స్పందించి ఈ ఫ్రీజర్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మరమ్మతులకు గురైన ఫ్రీజర్

అబ్దుల్‌కలాం సేవలు ఆదర్శప్రాయం

జయంతి వేడుకలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష కృషి చేసి, దేశానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చిన 11వ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం సేవలు ఇతరులకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు తెలిపారు. ఆయన జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రపంచ విద్యార్థి దినోత్సవం కార్యక్రమాన్ని భీమడోలు మండలంలో మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలులోని అబ్దుల్‌కలాం, డ్యాగురే వేదిక వద్ద భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు డి.శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షులు పిల్లి బ్రహ్మారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అబ్దుల్‌కలాం చేసిన సేవలను కొనియాడారు. ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని ఆయనతో పాటు యూనియన్ సభ్యులు విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాల వద్ద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం సిహెచ్‌కె.కుమార్, వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం లక్ష్మీదీప, చిత్రలేఖన పోటీల్లో ప్రథమ స్థానం ప్రేమాన్విత, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని బాల ప్రసన్న దక్కించుకున్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం తరపున ప్రధానోపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి సత్కరించారు.

టి.నరసాపురం : స్థానిక విజన్ యుపి స్కూల్‌లో మంగళవారం భారత 11వ రాష్ట్రపతి, భారతరత్న మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మభూషణ్, పద్మవిభూషణ్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు, ప్రపంచ విద్యార్థుల దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మహనీయుడు అబ్దుల్ కలాం అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సులోచన, వరలక్ష్మి, ప్రియాంక, జ్యోతి, అనూష, ప్రశాంతి, రమ్యశ్రీ, నక్షత్ర, సుమలత, మధులత పాల్గొన్నారు.

దెందులూరు :దెందులూరు బిఆర్‌డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రమ్య చేతులు ఏ విధంగా శుభ్రపరచుకోవాలో, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించింది. అబ్దుల్ కలాం గురించి మూడో సంవత్సరం చదువుతున్న భవాని వివరించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

తన భూమి అన్యాక్రాంతమైందని ఓ వృద్ధురాలు సిఎం చంద్రబాబునాయుడుకు పెట్టుకున్న అర్జీపై మంగళవారం తహశీల్దార్ జెఎస్.సుభాని విచారణ నిర్వహించారు. మండలంలోని వైవాకకు చెందిన కుర్మా జ్ఞాన సుందరమ్మ అసైన్డ్ భూమి 1.29 సెంట్లు అన్యాక్రాంతమైందని సిఎం చంద్రబాబును ఇటీవల మంగళగిరి పార్టీ ఆఫీసులో కలిసి అర్జీ పెట్టుకుంది. ఈ అర్జీ విషయమై విచారణ చేయాలంటూ సిఎంఒ నుంచి తహశీల్దార్‌కు ఆదేశాలు వచ్చాయి. దీంతో తహశీల్దార్ కుర్మా జ్ఞాన సుందరమ్మను, ఆమె భూమిని అన్యాకాంతం చేసిన అదే గ్రామానికి చెందిన కాగిత వెంకట సుబ్బమ్మను తహశీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ నిర్వహించారు. ఈ మేరకు కుర్మా జ్ఞాన సుందరమ్మ, కాగిత వెంకటసుబ్బమ్మ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను తహశీల్దార్ సుభాని రికార్డ్ చేశారు.

డైస్లెక్సియాపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కామవరపుకోట

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కల్పించడానికి, పిల్లల్లో పురోభివృద్ధి పెంచేందుకు ఎంఇఒ-1 డి.సుబ్బారావు ఆధ్వర్యంలో కామవరపుకోటలో డైస్లెక్సియాపై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డైస్లెక్సియా అంటే చదవడం, రాయడంలో లోపం గురించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 సిహెచ్.ప్రశాంత్‌కుమార్, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.పాల్, ఐఇఆర్‌టి ఎస్ బి.వెంకటేశ్వరరావు, బి.నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : డైస్లెక్సియాపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని రమణక్కపేట గ్రామంలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు డైస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.ప్రశాంతి, ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ, ఐఇఆర్ పి ఉపాధ్యాయులు డి ఎంవి లక్ష్మీనారాయణ, జె.నాగమలేశ్వరి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పోలవరం :పోలవరం మహాత్మాగాంధీ స్మారక వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు ముచ్చిక సీత మనవరాలి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు వృద్ధులకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. ముచ్చిక సీత మనవరాలు తేజస్విని ప్రియ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు.

సిఐటియులో 30 మంది లారీ డ్రైవర్లు చేరిక

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని లారీ, ట్రక్కు, వ్యాన్ డ్రైవర్లు దాదాపు 30 మంది సిఐటియులో చేరారు. కుక్కునూరు లారీ యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు సిఐటియులోకి జిల్లా అధ్యక్షులు సమక్షంలో చేరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న రవాణా రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డును(వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రహదారి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వాలకు సమకూర్చుతున్నా, కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైందని కనీసం గోతులను పూడ్చేందుకు కూటమి ప్రభుత్వానికి నాలుగు నెలలు సరిపోదా అని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల లారీలకు ఇసుక రవాణా చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. స్థానిక ఇసుక ర్యాంపుల నుంచి రవాణా చేసేందుకు ఇతర ప్రాంతాల లారీలను వినియోగించడం వల్ల మండలంలోని డ్రైవర్లు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిఐటియు మండలాధ్యక్ష, కార్యదర్శులు కుంజ నాగలక్ష్మి, యర్నం సాయికిరణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి మడివి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, లారీ యూనియన్ నాయకులు నిర్మల వెంకటేశ్వర్లు, కట్టబోయిన మల్లేష్, అంగిరేకుల వెంకటేశ్వరావు, సిఐటియు నాయకులు పోచరపు వెంకటేశ్వర్లు, కాకర్ల శ్రీను, బి.సుజాత, తిరోజుల సురేష్, పోచారపు వెంకన్నబాబు పాల్గొన్నారు.

డ్రైవర్లను సిఐటియులోకి ఆహ్వానిస్తున్న నాయకులు

వికలాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సమాజంలో పలు సమస్యలతో బాధపడుతున్నవారికి చేయూత అందించడంలో దాతల సహకారం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. మండల పరిధిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకురాలు మొవ్వ శారద ఆమె భర్త కీర్తిశేషులు డాక్టర్ కొత్త రవీంద్ర బాబు పేరున అందించిన ఆర్థిక సహాయంతో నలుగురు వికలాంగులకు ఆయన కృత్రిమకాళ్లను ఉచితంగా మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఉచిత కాళ్లను అందించేందుకు సహకరిస్తున్న కాకరాల శంకరరావు తదితరులను ఆయన అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి - భీమడోలు

నాణ్యమైన దిగుబడులు ఎక్కువ మొత్తంలో సాధించేందుకు, సాగు ఖర్చు తగ్గించుకునేందుకు ప్రకృతి వ్యవసాయం సహకరిస్తుందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హబీబ్ బాషా తెలిపారు. గుండుగొలను గ్రామ సచివాలయం మూడు, భీమడోలు గ్రామ సచివాలయం ఒకటి పరిధులలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారితో పాటు, వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు ఉషా రాజకుమారి పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో వ్యవసాయ అధికారికి వ్యవసాయ శాఖ అనుబంధ శాఖలో అధికారులు సహకరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో గతం కంటే భిన్నంగా రైతులు తమకు అందుబాటులో ఉన్న మిల్లును ఎంపిక చేసుకుని ధాన్యాన్ని తరలించేందుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. రైతులు భూసారం పెంచుకునేందుకు నవధాన్యాలు సాగు చేయాలని సూచించారు. పురుగు మందుల స్థానంలో ఆగ్నేయాస్త్రం వంటి కషాయాలను వాడి వాటిని అదుపు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయానికి చెందిన వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బయ్యన్నగూడెంలో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని శ్రీహరిపురం, కోడూరు, పెదపాలపర్రు, వడాలి, ముదినేపల్లి గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు నిమ్మగడ్డ కైకమ్మ, ఎం.దుర్గశ్రీ, పరసా విశ్వేశ్వరరావు, గంట రాకేష్ కుమార్, అడుసుమిల్లి వెంకట్రావు, మండల స్థాయి అధికారులు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి :పల్లె పండుగను పురస్కరించుకుని మండలంలోని తాడినాడలో మంగళవారం నిర్వహించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, కొత్తపల్లి బంగార్రాజు, మాజీ ఎంపిటిసి సభ్యులు రంగరాజు పాల్గొన్నారు. కొండూరులో జరిగిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచి వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, మాజీ సర్పంచి గొరిపర్తి నాగేశ్వరరావు, జనసేన సెంట్రల్ జోన్ ఆంధ్ర కో-కన్వీనర్ నల్లగోపుల వెంకట చలపతి, ఆంధ్రా తెలంగాణా రాధ రంగా మిత్ర మండలి ఛారిటబుల్ అధ్యక్షులు కాళ్లపాలెం బుజ్జి, సీనియర్ నాయకులు చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన భట్లమగుటూరు గ్రామానికి చెందిన బాదంపూడి వర్మ, తండ్రి: వెంకటేశ్వర రావు అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. భట్లమగుటూరులో ఇంటి దగ్గర నుండి జిరాక్స్ సెంటర్‌కి వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **M9177412** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బాదంపూడి వర్మ
తండ్రి: వెంకటేశ్వర రావు, డోర్ నెం: 1-38,
అరుంధతి వీధి, భట్లమగుటూరు,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 78933 64504

నల్లమాడు - కంసాలిగుంట రోడ్డు అధ్వానం

ఇబ్బందుల్లో ప్రయాణికులు
ప్రమాదాల బారిన వాహనదారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో అక్కుపల్లి గోకవరం నుంచి కంసాలిగుంట మీదుగా నల్లమాడు వెళ్లే జెడ్‌పికి చెందిన తారురోడ్డు పెద్ద పెద్ద గోతులతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని ఆవాస గ్రామ ప్రజలు వాపోతున్నారు. గోతులు ఏర్పడి వర్షపు నీటి వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. పాఠశాల, కళాశాలల బస్సులు గోతుల్లో దిగబడిపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంసాలిగుంట వద్ద చెరువు అంచు కోతకు గురై రోడ్డు సగం వరకు కోసుకుపోవడంతో ఆదమరుపుగా ఉండే ద్విచక్రవాహనాలు చెరువులో పడిపోయి వాహనదారులు గాయాలపాలవుతున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలోనైనా ఈ రోడ్డును బాగుచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నల్లమాడు - కంసాలిగుంట రోడ్డు దుస్థితి

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2024

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ ...డి.హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు ...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.25-10-2024 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

S.OP. 7/2024

Between:
పిటీషనరు: కూనపరెడ్డి లక్ష్మయ్య, S/o Late వీర రాఘవేంద్రరావు, వయస్సు: 54సం॥లు, జవ్వాదివారివీధి, పెనుగొండ.

మరియు

రెస్పాండెంట్లు:
1: జవ్వాది ఆదిలక్ష్మీదేవి, D/o. శ్రీరంగనాయకులు, వయస్సు: 70సం॥లు, పెనుగొండ.
2: వట్టికూటి రమా సుందరి, W/o. వెంకట సుబ్రమణ్యం, వయస్సు:67సం॥లు, డోర్ నెం: 3-10, C13/2, శాంతినగర్, కాకినాడ.

పిటీషనరు వేయించిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంధంలో పిటీషనర్ అయిన కూనపరెడ్డి లక్ష్మయ్య తణుకు ఆంధ్రా సుగర్స్ లో గల షేర్స్ సర్టిఫికెట్లు నా క్లయింటుకు **ది. 21-08-2014సం॥ తేదీన** జవ్వాది శ్రీరంగ నాయకులు గారి భార్య లక్ష్మీ నరసాయమ్మ గారు రిజిష్టర్ వీలునామా ద్వారా సంక్రమించినందున సదరు జవ్వాది లక్ష్మీనరసాయమ్మ గారు **ది. 27-08-2018 సం॥రం తేదీన** చనిపోయినందున షేర్ సర్టిఫికెట్స్ నిమిత్తం సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా కోరుచు పై కోర్టులో S.OP 7/2024 పిటీషను షెడ్యూలు కి సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించ వలసిందిగా కోరుచు పిటీషను దాఖలు చేసినందున యిందుపై యావన్మంది గ్రామ ప్రజానికానికి ఏ విదమైన అభ్యంతరములు వున్నచో **ది. 23-10-2024 సం॥ తేదిన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి లిఖిత పూర్వమైన ఆక్షేపణలు తెలియపర్చుకోగలరు. లేని యెడల పిటీషనరు తరపు తీర్మానించబడును. అని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
అడ్వకేట్
తణుకు తణుకు
తేది: 10-10-2024 సెల్: 70133 18947

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో,

S.OP. 6/2024

Between:
పిటీషనరు: వట్టికూటి రమా సుందరి, W/o వెంకట సుబ్రమణ్యం, వయస్సు: 67సం॥లు, డోర్ నెం: 3-10, శాంతినగర్, కాకినాడ, Post, Mandal, Dist (AP)

మరియు

రెస్పాండెంట్లు:
R-1: జవ్వాది ఆదిలక్ష్మీదేవి, D/o. శ్రీరంగనాయకులు, వయస్సు: 70సం॥లు, పెనుగొండ, Post, Mandal, Dist (AP)
R-2: కూనపరెడ్డి లక్ష్మయ్య, S/o. (లేటు) వీరరాఘవేంద్రరావు, పెనుగొండ, Post, Mandal, Dist (AP)

పిటీషనరు వేయించిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంధంలో పిటీషనర్ అయిన వట్టికూటి రమాసుందరి తణుకు ఆంధ్రా సుగర్స్ లో గల షేర్స్ సర్టిఫికెట్‌ని నా క్లయింటుకు **ది. 21-08-2014సం॥ తేదీన** జవ్వాది శ్రీరంగ నాయకులు గారి భార్య లక్ష్మీనరసాయమ్మ గారు వ్రాయించిన రిజిష్టర్డ్ వీలునామా ద్వారా సంక్రమించినందున సదరు జవ్వాది లక్ష్మీనరసాయమ్మ గారు **ది. 27-08-2018 సం॥రం తేదీన** చనిపోయినందున షేర్ సర్టిఫికెట్స్ నిమిత్తం సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించవలసినదిగా కోరుచు పై కోర్టులో S.OP 6/2024 పిటీషను షెడ్యూలు కి సక్సెషన్ సరిఫికెట్ ఇప్పించ గలందులకు కోరుచు పిటీషను దాఖలు చేసినందున యిందుపై యావన్మంది గ్రామ ప్రజానికానికి ఏ విదమైన అభ్యంతరములు వున్నను **ది. 23-10-2024 సం॥ తేదిన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని హాజరు అయ్యి లిఖిత పూర్వమైన ఆక్షేపణలు తెలియపర్చుకోగలరు. లేని యెడల పిటీషనరు తరపు తీర్మానించబడును. అని యిందుమూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
అడ్వకేట్
తణుకు తణుకు
తేది: 10-10-2024 సెల్: 70133 18947

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 492/2024/ఎ1 తేది.09-10-2024

సీల్డు టెండరు కం ఆక్షన్ నోటీసు

తాడేపల్లిగూడెం పురపాలక సంఘమునకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరమునకు గాను బ్రహ్మానందరెడ్డి మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్లలో ఆశీలు వసూలు చేసుకుని హక్కు నిమిత్తము ది. 21-10-2024 సోమవారం ఉదయం 11.00 గంటలకు ఈ పురపాలక సంఘ కార్యాలయము నందు సీల్డు టెండరు కం ఆక్షన్ నిర్వహించబడును.

వరుస సంఖ్య	వేలం వివరము	వేలం నందు కట్టవలసిన డిపాజిట్ రూ.	వేలం నందు చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ మరియు అగ్రిమెంట్ చార్జెస్ రూ.	వేలం నందు దాఖలుపరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ విలువ రూ.
1	2024-25 సంవత్సరమునకు సంబంధించి అనగా ది. 01-11-2024 నుండి 31-03-2025 వరకు శ్రీ బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ డైలీ & వారాంతపు మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్‌ల యందు ఆశీలు వసూలు చేసుకుని హక్కు	రూ. 8,00,000/-	రూ. 2,00,000/-	రూ. 25,00,000/-

1. సీల్డు టెండరు కం ఆక్షన్‌లో హెచ్చు పాటదారు పేరు పాట కొట్టివేయబడిన తర్వాత తిరిగి వేలం ఎక్కువ పాటకు పాడగలమని దాఖలు చేయబడిన టెండర్లు స్వీకరించబడవు. 2. సీల్డు టెండరు కం ఆక్షన్‌ను ఏ కారణము తెలుపకనే అంగీకరించుటకు గాని, నిరాకరించుటకు గాని ఎగ్జిక్యూటివ్ అధికారి వారికి పురపాలక సంఘమునకు అధికారం కలిగి ఉన్నది. 3. సీల్డు టెండరు కం ఆక్షన్‌లో పాల్గొనదలచిన వారు పాట తేదీనకు రెండు రోజులు ముందుగా సాల్వెన్సీ ధ్రువపత్రము కార్యాలయమునకు సమర్పించవలెను. 4. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగం నందు తెలుసుకొనవలసిందిగా తెలియజేయడమైనది.

సం/- **కమిషనరు**, తాడేపల్లిగూడెం పురపాలక సంఘము